కథానిక!

కుమారి మలినేని మంజూష.

అందాన్ని కొరుక్కు తింటామా? అంటారుకొందరు; వారందాన్ని అనుభవించలేని అసమర్థులు!
బాహ్యసౌందర్యం కంటె హృదయ సౌందర్యం ప్రధానం అంటారు
కాని బాహ్యసౌందర్యం లోపించిన ప్రతి వ్యక్తికీ
హృదయసౌందర్యం ఉందన్న గ్యారంటీఏది?

# కావలెను!

"నెలకు వెయ్యి రూపాయలకు పైగా సంపాదిస్తున్న అందమైన ఆంధ్ర యువకునకు చాల అందమైన వధువు కావలెను. కులముతో నిమిత్తములేదు. కట్నకానుక లవసరములేదు. వధువు ఫోటోతో వివరములతో పోస్టు బాక్సు 525, కేరాఫ్ "ది హిందు"కు వ్రాయండి."

సాయంత్రము నాలుగు గంటలకు అప్పుడే వచ్చిన హిందూ పేపరులోని ప్రకటనల పేజీని చూస్తున్న జానకిరామయ్యగారిని పై ప్రకటన విశేషముగా ఆకర్షించింది. ఆయనా ప్రకటనను ఒకటికి పదిసార్లు చదివి ఆలోచనలో పడ్డారు.

"నెలకు వెయ్యి రూపాయలకు పైగా సంపాద్రిస్తున్నాడు. పైగా అందమైన వాడు. ఈ రోజుల్లో వరులకు ఇంతకు మించిన అర్హతలేముంటాయి? కులముతో నిమిత్తము లేదట. కట్నకానుకల వసరములేదట. కుఱ్ఱవాడు చాల ఆదర్శభావాలు కలవాడుగ కనుపిస్తున్నాడు. ఇతనికి చాల అందమైన అమ్మాయిని పెళ్ళి చేసికోవాలనే కోరిక ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ ప్రకటన చేశాడు.

అందమైన అమ్మాయిలు! ఈనాడు మన దేశంలో పెళ్ళి కాని అందమైన అమ్మాయిలెంతమంది ఉన్నారు? బహుశా చాల తక్కువ మంది. ఈ రోజుల్లో ప్రతి ఒక్కడికీ అందమైన యువతుల మీదనే మోజు. డబ్బున్నవానికి, డబ్బులేని వానికి, చదువున్నవానికి, చదువులేని వానికిచివరకు ఏమీలేనివానికి కూడ అందమైన పెళ్ళాం రావాలనే ఆశ. ఆశ ఉండం సహజమే. కాని దేనికైనా అంతు ఉండాలి. అందమైన యువకుడు, చాల అందమైన యువతిని ఆశించుటలో కొంత అర్థముంది. కాని అంద విహీనుడు చాల అందమైన యువతిని ఆశించుట ఖచ్చితముగ అత్యాశే. కాని అందమనేది ఏ కోశాన లేని కొందరు తమ డబ్బు, లేదా పదవి యొక్క ఆసరాతో ఇతరుల నిస్సహాయతను వినియోగించుకొని అందమైన అమ్మాయిలను పెళ్ళాడ గలుగుతున్నారు. అందమైన అమ్మాయిలకు కూడ ఆశలుంటాయని అందమైన భర్తలు రావాలనేవారూ నిరంతరంకోరుకుంటారని చాల మందికి తెలియదు కాబోలు. ఒక అందమయిన అమ్మాయి ఒక అందవిహీనుణ్ణి పెళ్ళాడతానని ఒప్పుకుందంటే అది పరిస్థితులు ఒత్తిడి వల్లనే కాని మనస్ఫూర్తిగ కాదని గ్రహించగల శక్తి చాల మందికి ఉన్నదా?

సుబ్బారావు కూతురు శారదను తలంచుకుంటే తన కెప్పుడూ విచారము కలుగుతుంది. శారద బంగారపు బొమ్మ. ఏ వంకాలేని సుందరి.

# వధువు!

అటువంటి చక్కని పిల్లను సుబ్బారావు "కోల్ బ్లాక్ వానరముఖునకు" ఇచ్చి పెళ్ళి చేసాడు. పాపం సుబ్బారావు మట్టుకు ఏంచేస్తాడు? పరిస్థితులట్టివి. శారద ఎంత చక్కనిదైనా కట్నం లేకుండ ఆమెను పెళ్ళాడటానికి ఎవరూ ముందుకు రాలేదు ఆ ఒక్క వానరముఖుడు తప్ప. అతడైనా పిల్ల చాల అందమయినదైనందున ఆశపడి ఒప్పుకున్నాడు. ఆ పెళ్ళి వద్దని శారద ఎంత ఏడ్చిందో, ఆత్మహత్య చేసికొంటానని ఎంత బెదిరించిందో తనకు బాగా తెలుసు. కుబ్జవానికి అందములేక పోతేనేం, అతడు చాల బుద్ధిమంతుడని, చాల తెలివైన వాడని, నెలకు ఆరువందలకు పైగా సంపాదిస్తున్నాడని, భార్యను చాల సుఖపెట్టుతాడని, పువ్వులలో పెట్టి పూజిస్తాడని ఇంకేమేమో చెప్పి శారదను బలవంతముగ పెళ్ళికి ఒప్పించిన పెద్ద మనుష్యులలో తాను కూడా ఉన్నాడు. తన కాపెళ్లి జరగటం ఏ మాత్రము ఇష్టములేదు. కాని సుబ్బారావు కోరికపై తాను కూడ శారదనా పెళ్లికి బలవంతము చేసాడు. ప్రాణము మీద తీపిచేత చావలేకనే, శారద చివరికా పెళ్లి కొప్పుకుందని, తనకు బాగా తెలుసు.

పెళ్ళయిన తర్వాత ఈ సంవత్సరంన్నరలో శారద ఎంతగ మారి పోయింది! గుర్తుపట్టుటకు వీలులేకుండ మారిపోయింది. ఆ అందమంతా ఏమయిపోయిందో? ఎప్పుడూ ఆమె పెదవులమీద మెరిసే చిరునవ్వు ఎక్కడికి పోయిందో? ఆమె భర్త ఆమెను చాల ప్రేమతోనే చూస్తాడట. అయినా ఆమెకు సుఖములేక పోవచ్చును. మానసిక బాధ మనిషిని శుష్కింప జేయుటలో ఆశ్చర్యమేముందిలే! శారదకు పుట్టిన కొడుకును చూస్తే తనకెంతైనా విచారము కలిగింది. అంత అందమయిన శారదకు అంత కురూపియైన కొడుకా? భగవానుని లీలలు విచిత్రాలు!

తను కోరేదల్లా ఒకటే. శారదకు పట్టిన దుర్గతి తన ముద్దుల కూతురు సునందకు పట్టకుండ ఉండటమే. ఒకప్పుడు బాగా బ్రతికిన తాను బొత్తిగ చితికి పోయినందు వల్లనే కదా చక్కని చుక్కయైనా సునందకింత వరకు పెళ్లి చెయ్యలేక పోయాడు. సునందకేం తక్కువ? చాల అందమయినది. శారద కంటె కూడ అందమయినది. చాల బుద్ధిమంతురాలు. ఫస్టు క్లాసులో మెట్రిక్ పాసయింది. అయినా మూడేళ్ళుగ ప్రయత్నిస్తున్నా తాను సునందకు ఎందుకు పెళ్లి చేయలేకపోయాడు? తన దగ్గిరకట్నమియ్యడానికి వేల సంఖ్యలో రూపాయలు లేవు కాబట్టి. ఈ మధ్యనే వరకట్న నిషేధపు బిల్లును ప్రవేశపెట్టారు. అయినా ఏం లాభం? వరకట్నము రూపు మార్చుకొంది. అంతే! ప్రజలలో సంస్కారము వర్ధిల్లాలి. అప్పుడే పరిస్థితులు బాగవుతాయి.

తను సుబ్బారావులాటివాడయితే ఈ పాటికేదో విధంగా సునందకు పెళ్లిచేసేవాడే. ఆమె జీవితాన్ని నాశనంచేసేవాడే. కాని తన మనస్తత్వము వేరు. భావాలు వేరు. సునంద జీవితాంతము వరకు బ్రహ్మచారిణిగ ఉన్నా తానంతగ బాధపడదు. కాని ఆమె ఏకురూపికో భార్య అవుతే తాను చాల బాధపడతాడు. ఏ మాత్రము సహించలేడు. తన భావాలు చాల మందికి రుచించవని తనకు తెలుసు. అందముంటే కొరుక్కుతింటామా అని కొందరు అంటుంటారు. వాళ్ళంతా అందాన్ని అనుభవించలేని అసమర్థులు. లేదా తమ స్వార్థంకోసం మాటల్ని ఉపయోగించుకునే స్వార్థపరులు. మరి కొందరంటుంటారు బాహ్య సౌందర్యము కంటె హృదయ సౌందర్యమే ముఖ్యమైనదని. అది నిజమే. కాని బాహ్య సౌందర్యములోపించిన ప్రతి వ్యక్తికీ హృదయ సౌందర్యము తప్పకుండా ఉంటుందనే గ్యారంటీ ఏది?

ఏమైనా త్వరలోనే మంచిరోజులు వస్తాయనే ఆశ తనకుంది. ఇప్పుడిప్పుడే మంచి అర్హతలుగల కొందరుయువకులు కట్నంకానుక లేవితీసికోకుండ పెళ్ళి చేసుకోడానికి ముందుకువస్తున్నారు. అటు వంటప్పుడు సౌందర్య రాశియైన తన కూతురుకు తప్పకుండ మంచి భర్త లభిస్తాడు. తానుకూడ గట్టి ప్రయత్నాలుచేయాలి......

...ఇంకా ఆలోచించబోతున్న జానకి రామయ్యగారు "ఏమండీ"అనే భార్య పిలుపుతో మళ్ళా ఈ లోకంలోకి వచ్చిపడ్డారు. చిరు నవ్వుతో పేపరులోని ప్రకటనను భార్యకు చదివి వినిపించారు. సునంద ఆ అబ్బాయికి నచ్చు వచ్చుననే ఆశ తనకున్నదన్నారు. ఇంకా ఏమేమో అన్నారు.జానకిరామయ్యగారి మాట లను శ్రద్ధతో విన్న ఆయన భార్య ఒక చిరు నవ్వును నవ్వి పనుందనిచెప్పి లోపలికి వెళ్ళింది.

ఆ మరునాడే జానకిరామయ్యగారు పోస్టు బాక్సు 525, కేరాఫ్ "ది హిందు" ఒక ఉత్త రములో సునందకు సంబంధించిన వివరములు చక్కగ వ్రాసారు. ఆ మధ్యనే విజయవాడలోని ఫోటోస్టూడియోలో తీయించిన సునంద ఫోటోనుకూడ ఉత్తరముతోపాటు పంపారు. ఉత్తరమును పోస్టుచేసిన నాలుగవ నాటి నుండియే జానకిరామయ్యగారు జవాబు కొరకు ఎదురు చూడటం ప్రారంభించారు. రోజులు గడుస్తున్నాయిగాని జవాబు మాత్రంరాలేదు. జానకిరామయ్యగారు ఆశతో ఇంకా ఎదురు చూస్తూనేఉన్నారు. పాపం! జవాబు రానే రాదని ఆయనకేం తెలుసు?

ఆ కాలేజి హాస్టలులోని తనగదిలో రామ్ కుమార్ పదిమంది మిత్రులకు ఒక చిన్న ట్రీట్ ఇస్తున్నాడు. అందరూ ఐస్‌క్రీము తిన్న తరువాత రామ్‌కుమార్ లేచి నిలబడి ఉపన్యాస ధోరణిలో ఇలా అన్నాడు. "సుమారు పది హేను రోజులక్రితం హిందూ పేపరులో "వధువు కావలెను" అనే ప్రకటనను నేను చేసినప్పుడు మీరందరూ నేను వట్టి తెలివి తక్కువ వాడినని, డబ్బును వేస్టు చేశానని, ఒక్క జవాబు కూడ రాదని. ఇంకా ఏమేమో అన్నారు. కాని ఇప్పుడు మీరు తెలివి తక్కువ వాళ్ళని ఋజు వయింది. నా ప్రకటనకు రెస్పాన్సుగ మొత్తము నూటఇరవైఏడు ఉత్తరాలు వచ్చాయి. అందులో నూటపన్నెండు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చాయి, నేనూ హించినట్లుగనే ప్రతి ఉత్తరముతో ఒక అందమైన అమ్మాయి ఫోటో పంపించబడినది. ఆ నూటఇరవై ఏడుగురు సుందరుల ఫోటోలను నేను మూడు చక్కని ఆల్బములలోనీటుగా అంటించాను. ఇందువల్లనే నేను రెండు రోజులుగ కాలేజికి రాలేదు. కేవ లము పదిరూపాయల ఖర్చుతో నూటఇరవై ఏడుగురు అందమైన అమ్మాయిల ఫోటోలను సంపాదించటం నిజంగా అదృష్టమనే చెప్పాలి"

మరో రెండు నిముషాలలో రామ్‌కుమార్ ఇచ్చిన ఫోటో ఆల్బములను తీసికొని అతని మిత్రులు ఆ ఆల్బములలోని అమ్మాయిల ఫోటో లను చూడటంలోను. యువకుల భాషలో ఆ అమ్మాయిల సౌందర్యాన్ని ప్రశంసించటంలోను నిమగ్నులైపోయారు. వారందరి ముఖాలు ఆనందముతో మెరుస్తున్నవి.

కాని బాధ్యత అంటే ఏమిటో సరిగా అర్థం చేసికోలేని రామ్‌కుమార్‌గాని అతని మిత్రులు గాని, పలురకాల బాధ్యతలతో అపరిమిత మనః క్లేశాన్ననుభవించే జానకిరామయ్యలాంటి తండ్రు లవిషాదవదనాలను ఆ సుందరాంగుల ఫోటోల బాక్‌గ్రౌండులో చూడ గలిగిననాడు వారి ముఖాలు అలా ఆనందముతో మెరుస్తాయా? ఏమో!

★